క్లుప్తంగా

కండలేరులో 5.986 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 5.986 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్య సాయిగంగ కాలువకు 115, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అంకాళమ్మకు విశేష పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

కోట: మండలంలోని శ్యామ్‌సుందరపురంలో వెలసిన అంకాళ పరమేశ్వరి అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్టాపన, కుంభాభిషేక మహోత్స వాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ప్రధాన కలశ స్థాపన, యాగశాల పూజలు, ప్రధాన హోమాలు, లఘు పూర్ణాహుతి, చండీ హోమం చేపట్టారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో ట్రాఫిక్ జామ్



రోడ్డులో ఇరుక్కుపోయిన లారీ

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో శనివారం ఉదయం రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. సైదాపురం–పాదలకూరు రోడ్డులో గుంతల్లో లారీ ఇరుక్కుపోయింది. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు వాహనాల రాకపోకలు స్తంభించాయి. విషయం తెలు సుకున్న ఎస్‌ఐ డీఎస్ విజయ్‌కుమార్ అక్కడికి చేరుకుని జేసీబీతో లారీని పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ గోపి

నాయుడుపేట టౌన్: వాహనదారులు నిబంధ నలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్‌ఐ గోపి హెచ్చరించారు. ఆయన శనివారం సాయంత్రం నాయుడుపేట సీఎఫ్ తేజా సెం టర్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవర్ల లైసెన్స్‌లు, రికార్డులను పరిశీలించారు. రికా ర్డులు సక్రమంగా లేని 20 వాహ నాలకు అప రాదం విధించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఎస్‌ఐ ధర్మయ్య, హెడ్‌కాని స్టేబుల్ మధు తదితరులు పాల్గొన్నారు.

532 మందికి నియామక పత్రాలు

గూడూరు రూరల్: గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో పలు కం పెనీల్లో 532 మంది ఉద్యోగాలు సాధించారు. వారికి నియామక పత్రాలు అందజేశారు. జాబ్ మేళాను కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య, డైరెక్టర్లు ప్రారంభించారు. వంకి పెంచలయ్య మాట్లాడుతూ 23 ఏళ్లుగా కళాశాలలో జాబ్ మేళాలు నిర్వహిస్తూ వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎంతో మంది విద్యార్థులు కంపెనీలు నిర్వహిం చే ఇంటర్వ్యూల్లో ప్రతిభను చూపి ఉద్యోగాలు సాధిస్తున్నారని వివరించారు. ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపి అవకాశాలు పొందేందుకు తమ అధ్యాపకులు ఎంతో తర్ఫీదు ఇస్తున్నారని తెలి పారు. అందువల్లే అనేక మంది ఒకేసారి ఉద్యో గాలు సాధిస్తున్నారని చెప్పారు. ఉద్యోగాలు పొందిన వారు తమతో పాటు చదువుకున్న వారికి సహకరించి ఆయా కంపెనీల్లో అవకా శాలు కల్పించాలని సూచించారు. కళాశాల వైస్ చైర్ పర్సన్ వంకి అనూష, చైర్‌పర్సన్ కటారి అరవింద, డైరెక్టర్ డాక్టర్ ఆర్‌జే మురుగదాసు, ఏవో రామయ్య పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూములు అభివృద్ధి చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆల త్తూరు, బీఎస్‌పురం, కొత్తపాళెం, తొట్టంబేడు మండలంలోని రౌతుసూరమాలలో ఏపీఐఐ సీకి కేటాయించిన భూములను త్వరితగతిన అభివృద్ధి చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ యువరాజ్ అధికారులను ఆదేశిం చారు. ఆయన శనివారం ఆయా గ్రామాల్లోని ఏపీఐఐసీ భూములు, రికార్డులను పరిశీలిం చారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల అభి వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. మండలంలోని ఆల త్తూరు, బీఎస్‌పురం, కొత్తపాళెం గ్రామాల్లో 2,095 ఎకరాల ఏపీఐఐసీ భూములు ఉన్నా యన్నారు. వాటిని అభివృద్ధి చేసి, పరిశ్రమ లకు కేటాయించనున్నట్లు తెలిపారు. పరిశ్ర మల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకుంటే 21 రోజుల్లో భూమి కేటాయిస్తామని తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీసిటీని సందర్శిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ సుబ్రమణ్యం, డీటీ చంద్రబా బునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పడిగాపులు తప్పవా?

చౌక దుకాణాలు దూరంగా ఉండడంతో ప్రజలు నిత్యావసరాలు తెచ్చుకునేందుకు ఇక్కట్లు పడేవారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఎండీయూ ఆపరేటర్లను ఎంపిక చేసి, వారికి వాహనాలను సమ కూర్చింది. వారు వీధివీధి తిరుగుతూ నిత్యావ సరాలు పంపిణీ చేసి, లబ్ధిదారులకు శ్రమ లేకుండా చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇం టి వద్దకే రేషన్ విధానాన్ని రద్దు చేస్తున్నారు. దీంతో రేషన్ లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొం ది. రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. –చిల్లకూరు



ఎండీయూ వాహనం ద్వారా సరుకుల పంపిణీ(ఫైల్)



ఎండీయూ వాహనం

- ఇంటి వద్దకే సరుకుల పంపిణీ రద్దు
- ఎండీయూ ఆపరేటర్ల జీవనోపాధి కట్

మండలం	చౌక దుకాణాలు	వాహనాలు	కార్డుదారులు
గూడూరు పట్టణ, రూరల్	63	22	34,205
చిల్లకూరు	38	10	17,100
కోట	33	10	16,400
వాకాడు	30	08	12,500
చిట్టమూరు	33	15	13,300

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ విధానాన్ని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా ఎండీయూ ఆపరేటర్లను ఎంపిక చేసింది. వారికి కార్పొరేషన్ ద్వారా ఆరేళ్ల అగ్రిమెంటు చేసుకుని వాహనం కోసం ప్రతినెలా రూ.3 వేలు వాయిదాలు చెల్లించేలా చూసింది. అలాగే వాహనాలను నడిపే వారికి రూ.18 వేల జీతం ఇచ్చేలా చర్యలు చేపట్టి, ఎంతో మందికి జీవన భృతి కల్పించింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ గత ప్రభుత్వం అమలు చేసిన ప్రతి పనికీ సాకులు చూపిస్తూ వాటిని రద్దు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్ర బాబు ఎండీయూ వాహనాలను రద్దు చేసేలా నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో ఎండీయూ వాహనాలకు వాయిదాలు పూర్తి కాక ముం దుగానే ఇలా అర్ధంతరంగా వాహనాలను రద్దు చేస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అలాగే తమ ఇంటి వద్దకు క్రమం తప్పక వచ్చి సరుకులు ఇచ్చే వాహనాలను రద్దు చేయడం ఎంత వరకు సమం జసమని పేదలు ప్రశ్నిస్తున్నారు.

కార్డుదారుల పరిస్థితి దయనీయం

గూడూరు నియోజకవర్గంలోని గూడూరుతోపాటు గూడూరు మండలం, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఉన్న చౌక దుకాణాల కిం ద ఉండే రేషన్‌దారులకు సరుకులు ఇంటి వద్దనే ఇచ్చే వారు. నేడు ఆ పరిస్థితి లేదని తెలియడంతో వృద్ధులు, వికలాంగులు తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణ యాన్ని సమర్థించాల్సింది పోయి ఇలా ప్రతీది రద్దు చేసుకుంటూ పోతే ఎలా అని ప్రజలు నిలదీస్తున్నారు.

ఇబ్బందులు తప్పేట్టు లేవు



గతంలో బియ్యం, కందిపప్పు, చక్కెర ఇంటి వద్దకే వచ్చి వాహనంలో అందిం చే వారు. నేడు ఆ వాహనాలను రద్దు చేస్తే డీలర్ దగ్గరకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తుంది. ఇలా అయితే దూరంగా ఉండే రేషన్ షాపు దగ్గరకు వెళ్లి ఇచ్చిన బియ్యం ఇంటి దాకా మోసుకుని పోవాలంటే మరొకరి సాయం తీసుకోవాల్సిందే. ఇలా పేదలకు ఇబ్బందులు కలిగిం చడం బాగాలేదు.

–అన్నపూర్ణమ్మ, కమ్మవారిపాళెం, చిల్లకూరు మండలం

దూరం పోవాలంటే కష్టంగా ఉంటుంది



చౌకదుకాణాలు గ్రామానికి దూరంగా ఉన్నాయి. గత ప్రభుత్వం ఇంటి వద్దకే వచ్చి సరుకులు అం దించే ఏర్పాటు చేసింది. దీనివల్ల పని వదిలేసి ఉండాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇం టిలో ఎవరు ఉన్నా సరుకులు తీసుకునే వారు. ఇప్పుడు దూరంగా ఉన్న రేషన్ షాపు వద్దకు వెళ్లాలంటే పని వదిలే సుకుని ఒక పూట అక్కడికి వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి. ఇలా పేదలను ఇబ్బంది పెట్టడం ఎందుకు. ముందు ఎలా ఇచ్చేవారో అలాగే ఇవ్వాలి.

–రాంబాబు, అల్లంపాడు, కోట మండలం

పేదోళ్ల సుఖాన్ని ఓర్వలేక పోతున్నారు



గత ప్రభుత్వంలో అమలు చేసిన ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమం ద్వారా తమలాంటి పేదోళ్లు నెలనెలా ఇంటి ముందే రేషన్ తీసుకుని హాయిగా జీవించాం. ఫలితంగా మేము మూడు కిలోమీటర్లు దూరం వెళ్లి రోజంతా పడిగా పులు కాయకుండా, ఆటో బాడుగ లేకుండా యథావిధిగా కూలీ పనులకు వెళ్లి సంపాదించుకునే వాళ్లం. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం పుణ్యమా అంటూ ఇంటింటికీ రేషన్ తొలగించడంతో మళ్లీ 3 కిలో మీటర్లు దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో ఒక రోజు కూలి పనులు మానుకోవాల్సి పరిస్థితి వస్తుంది.

– కుక్కముళ్ల పెంచలయ్య, వాకాడు

కల్యాణం.. కమనీయం



నృసింహ స్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచు లక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిం చారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశే షంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. 6 గంటలకు పూలంగిసేవ నిర్వహించారు. 10 గంట లకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను నిత్యక ల్యాణ మండపంలో కొలువుదీర్చారు. విశేషంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

నేడు చందనాలంకరణ

లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తి ఆదివారం చం దనాలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా ఉదయం 4 గంటలకు సుప్రభాతం, 9 గంటలకు శాంతి హోమం, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంట లకు గరుడ సేవ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

లారీ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలు



దొరవారిసత్రం: దొరవారిసత్రం సమీపంలోని జాతీ య రహదారిపై శనివారం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ మారిముత్తు గాయపడ్డాడు. చెన్నై నుంచి హైదరాబాదుకు వెళుతున్న లారీ దొరవారి సత్రం సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పంట సాగుపై అధికారుల సర్వే

చిల్లకూరు: తీర ప్రాంతంలో చెన్నై– బెంగళూరు కోస్టల్ కారిడర్ కోసం సేకరించనున్న భూముల్లో శనివారం పలు శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టారు. పది రోజుల నుంచి రెవెన్యూ అధి కారులు సర్వే చేస్తూ భూ సేకరణ చేపట్టిన భూముల్లో ఎవరు సాగులో ఉన్నారు, ఎవరి ఆధీనం లో ఎంత భూమి ఉంది అన్న విషయాలను సేకరిం చి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఈ క్రమంలోనే రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన, అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేప ట్టారు. దీర్ఘకాలిక పంటలైన జీడిమామిడి, తాటి, వేప, సవక, జామాయిల్ లాంటి వాటితో పాటు వేరుశనగ, వరి పంటలు, సాగు చేస్తున్న వారి వివ రాలు, పంటల ద్వారా రైతులకు వచ్చే ఆదాయం, వాటిని కోల్పోతే ఎంత పరిహారం ఇవ్వాలి తదితర విషయాలను నివేదికల రూపంలో ఉన్నతాధికారు లకు అందజేయనున్నారు.



జీడిమామిడి వివరాలు సేవరిస్తున్న అధికారులు

ముగిసిన శిక్షణా తరగతులు

చిల్లకూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మూడు రోజులుగా సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఇందులో ఆర్థిక ప్రణాళికలు సిద్ధం చేసి పంచాయతీల అభివృ ద్ధికి ఎలా నిధులు సేకరించాలనే అంశాలపై సర్పం చులకు వివరించారు. వీధి దీపాల నిర్వహణ, చెత్త నుంచి సంపదను సృష్టించడం, పారిశుద్ధ్యం మెరుగుపరచడం, ఇంటి పన్ను వసూళ్లు తదితరా లపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వారికి సరిఫ్టికెట్లు అందజేశారు. కార్యక్ర మంలో ఎంపీడీవో భానుమూర్తి, ఈవోపీఆర్‌డీ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

16న సర్వసభ్య సమావేశం

ఈ నెల 16న మండల సర్వసభ్య సమావేశాన్ని ఎం పీపీ తుపాకుల వెంకటరమణమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భానుమూర్తి తెలి పారు. ఈ సందర్భంగా పలు విషయాలపై సమీక్ష ఉంటుందని, అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతి నిధులు హాజరుకావాలని సూచించారు.

దెబ్బతిన్న నెర్రికాలువ లాక్‌లు



చందనముడి సమీపంలో నెర్రికాలువలో లాక్ కొట్టుకుపోయి దెబ్బతిన్న కాంక్రీట్ నిర్మాణం.



టపాయిండ్లు గ్రామ సమీపంలో దెబ్బతిన్న లాక్‌లు

దొరవారిసత్రం: దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల్లోని చెరువులకు నీటిని తీసుకెళ్లే నెర్రికాలువ లాక్‌లు, కాంక్రీట్ లైనింగ్‌లు దెబ్బతి న్నాయి. వాటికి మరమ్మతులు చేయకపోవడంతో వర్షపు నీరు వస్తున్నా చెరువులకు నీరు చేరడం లేదు. వాటిని బాగు చేయాలని రైతులు, పలు గ్రామాలకు చెందిన రైతులు అధికారులకు విన్నవిం చినా ఫలితం లేదు. దీంతో వర్షపు నీరు వృథాగా పోతోంది. దొరవారిసత్రంలోని నెర్రికాలువ సుమారు 18 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉం ది. దీని ద్వారా దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల్లోని 17 చెరువులకు సాగునీరు అం దుతుంది. ఈ చెరువుల కింద 15 వేల ఎకరాల్లో పం టలు సాగవుతాయి. చందనముడి గ్రామ సమీపం లో నెర్రికాలువ మూడుగా చీలి పలు చెరువుల్లోకి సాగు నీరు చేరుతాయి. ఈ కాలువపై పలుచోట్ల చెరువుల్లోకి నీరు చేరేలా లాక్‌లు, కాంక్రీట్‌తో లైనిం గ్ నిర్మాణాలు చేపట్టారు. గతంలో తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి లాక్‌లు దెబ్బ తిని కొట్టుకుపోయాయి. కాలువలో కాంక్రీట్ లైనిం గ్ పనులు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా డీవీ సత్రం మండలంలోని మావిళ్లపాడు, మినమనముడి, టపాయిండ్లు, తల్లంపాడు తదితర గ్రామాల సమీ పంలో లాక్‌లు దెబ్బతిని కొట్టుకుపోయాయి. అదే విధంగా కాలువలోని కాంక్రీట్ లైనింగ్‌లు నీటి ప్రవాహానికి ధ్వంసమయ్యాయి. వాటికి మర మ్మతులు చేపట్టలేదు. గత నెలతోపాటు ఈ నెలలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నా నీరు వృథాగా పోతోందని రైతులు వాపోతున్నారు. వీటి మరమ్మ తుల కోసం సంబంధిత ఇరిగేషన్ అధికారులు ప్రతి పాదనలు పంపడం తప్పా నిధులు మంజూరైన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సం బంధిత అధికారులు స్పందించి సకాలంలో మర మ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



సంప్రదాయ గిరిజన వేషధారణలో విద్యార్థినులు

రాపూరు: రాపూరులోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ క్రిష్టియానా జేమ్స్ మాట్లాడుతూ గిరిజనుల కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలుచేస్తోందన్నారు. ఉన్నత విద్య చదువుకునేందుకు రాష్ట్రంలో 190 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసినట్టు పేర్కొ న్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఐటీడీఏ విశేషం గా కృషి చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గిరిజన విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినులు గిరిజన సంప్రదాయ దుస్తులు ధరించి ఆట, పాటలతో అల రించారు.

భక్తులకు అన్నదానం

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తు లకు అన్నదానం చేశారు. ఉదయం స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం ఆదిలక్ష్మీ అమ్మవారికి గాజులతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు భారీగా అన్నదానం చేశారు. సాయంత్రం ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీతో పాటుగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తు లను పల్లకి ఊరేగించారు. ఈ కార్యక్రమాలకు దాతలు సహకారం అందించగా, భక్తులకు ఎలాం టి ఇబ్బందులు కలుగకుండా ఈవో తాతా శ్రీనివా సరావు పర్యవేక్షించారు.



గాజుల అలంకరణలో ఆదిలక్ష్మీ అమ్మవారు



అన్నదానం చేస్తున్న భక్త బృందం

పేద పిల్లలకు సహకారం అభినందనీయం



పేద పిల్లలకు దుస్తులు అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు, ఏవో

చిల్లకూరు: పీపుల్స్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యు కేషనల్ ట్రస్టు ద్వారా పేద పిల్లలకు సేవ చేయడం అభినందనీ యమని మండల వ్యవ సాయశాఖాధికారిణి గూడూరు భవాని తెలి పారు. ట్రస్టు ఆధ్వర్యం లో శనివారం నెలబల్లిరె ట్టుపల్లిలో ఉన్న గిరిజన కాలనీలో సుమారు 100 మంది పిల్లలు, పెద్దలకు దుస్తులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ చిల్లకూరు గ్రామానికి చెందిన బోరు మెకానిక్ మల్లికార్జున్ తనకు వచ్చిన జీతంతో పాటు దాతల ద్వారా సేకరించిన మొత్తంతో ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు చేపడుతు న్నందనే మల్లికార్జున్‌కు డాక్టరేట్ ఇచ్చారని, ఇలాం టి చిరుద్యోగి పేదలకు అండగా నిలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ఆబాక రమణారెడ్డి, ట్రస్టు ప్రతినిధులు చిల్లకూరు అరుణ్‌బాబు, కంటేపల్లి చెంచయ్య, చల్లా శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



సైదాపురం : అధ్వానంగా మారిన రోడ్డు

దొరవారిసత్రం: మండలంలోని పలు గ్రామాల్లో వీధులు, రోడ్లు చినుకు రాలితే చిత్తడిగా మారుతు న్నాయి. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలిచి నడిచేందుకు కూడా వీలు లేకుండా పోతోంది. పోలి రెడ్డిపాళెం–కల్లూరు, అనేగొట్టం–కరటాముడి, కొర్ల గుంట, అయ్యపాళెం, మేలుపాక, చవటకండ్రిగ, పాళెంపాడు, వేణుంబాకం తదితర గ్రామాల రోడ్లపై అడుగడుగనా గుంతలు పడి ప్రయాణం నరకంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. కల్లూరు, శ్రీధనమల్లి, పూలతోట, వేణుంబాకం, కట్టువాపల్లి, తొగరాముడి, తుంగమడుగు, పోలిరెడ్డిపాళెం, గొల్లపాళెం, చందనముడి, తల్లంపాడు, మొదుగుళ పాళెం, బురదమడుగు, ఉచ్చూరు, నెలబల్లి తదితర గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ వర్షపు నీరు నిలిచి దారుణంగా దర్శనమిస్తున్నాయి. దీంతో అంటురోగాలు ప్రబలుతాయేమోనని ప్రజలు ఆం దోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు స్పందించి నీటిని తొలగించే పనులు చేప ట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సైదాపురం మండలంలో..

సైదాపురం: మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు సైదాపురం–పాదలకూరు రోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఉండడంతో నీరు నిలిచి నడిచేందుకు కూడా వీలు లేని పరిస్థితి. వాహనదారులు నిత్యం ప్రమాదాల బారినపడి గాయపడుతున్నారు. ఉన్న తాధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



దొరవారిసత్రం: కల్లూరు గ్రామంలోని వీధుల దుస్థితి





చవటకండ్రిగ రోడ్డు దుస్థితి

టీచర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయం

దొరవారిసత్రం: యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణోత్సవాల పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యా యుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే మార్గమని తెలిపారు. అనంతరం యూటీఎఫ్ ఆవి ర్భావం, త్యాగాల గురించి పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు ప్రభాకర్, రాధాకృష్ణయ్య, రమేష్, దిలీ ప్‌కుమార్, హుస్సేన్‌బాషా పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

రాపూరు: స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శని వారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనం గా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెండాను ఎగురవేశారు. ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ చేప ట్టారు. యూటీఎఫ్ నాయకుడు హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ యూటీఎఫ్ ఏర్పడి 50 ఏళ్లు పూర్త యిన సందర్భంగా వేడుకలు జరుపుకున్నట్టు తెలి పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో కాకినాడలో స్వర్ణో త్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. యూటీ ఎఫ్ నాయకులు నాదానందరావు, అంకయ్య, సుం దరయ్య, పెంచల నరసయ్య, ప్రసాద్, సుబ్రమ ణ్యం, శ్రీనివాసులు, సురేష్, రాజేష్, సుధాకర్, శివ సాయి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న యూటీఎఫ్ కార్యాలయం వద్ద శనివారం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భం గా ఆ సంఘం ఉపాధ్యాయులు ఆవిర్భావ దినోత్స వాన్ని, స్వర్ణోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిం చారు. డిసెంబర్‌లో కాకినాడ నగరంలో జరిగే మహాసభలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నాయకులు పిలుపుని చ్చారు. కార్యక్రమంలో నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాలకు చెందిన ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే సుబ్బారావు, టీ గోవర్ధన్ రెడ్డి, జీ శ్రీనివాసులు, ప్రభుదాస్, శివప్ర సాద్, వాసు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కే శేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ ఎం రామ్మూర్తి, మూడు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు